
05-04-2025
శనివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 195 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి




## వక్ఫ్ సవరణతో పేదలకు న్యాయం



✍ జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:

పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చలలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన.. అలాగే.. ఈ చట్టాలను బలోపేతం చేయడంలో దోహదపడిన ఎంపీలందరికీ తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన ట్వీట్ చేశారు. పార్లమెంటరీ కమిటీకి తమ విలువైన సూచనలను పంపిన ప్రజలందరికీ కూడా ప్రధాని మోదీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

...మిగతాది 2 లో

## సోనియాని మందలించిన లోక్‌సభ స్పీకర్

- సభా కార్యకలాపాలపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం 'అత్యంత దురదృష్టకరం'

✍ జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 :

వక్ఫ్ (సవరణ) బిల్లును 'దుందుడుకు ధోరణితో ఆమోదించుకున్నారు' అని వ్యాఖ్యానించినందుకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా శుక్రవారం మందలించారు. సభా కార్యకలాపాలపై ఒక సీనియర్

...మిగతాది 2 లో






# విశ్వవిద్యాలయాలే దేవాలయాలు


## వారి భవిష్యత్ ను తీర్చిదిద్దే కేంద్రాలు

**మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లోని కోర్సులలో మార్పులు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైస్ ఛాన్సలర్లకు సూచించారు. మార్కెట్‌లో డిమాండున్న కోర్సులను బోధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా వర్సిటీలు పని చేయాలని అన్నారు.**

✍ జయభేరి, హైదరాబాద్ :

విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో ముఖ్యమంత్రి గారు సమావేశమయ్యారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్థోమత లేని కుటుంబాల నుంచే విద్యార్థులు వస్తున్నారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బోధనకు వర్సిటీలు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.ఆర్థికంగా స్థోమత ఉన్న కుటుంబాల పిల్లలు మార్కెట్‌లో డిమాండున్న కోర్సులను ఎంచుకొని ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైపు వెళ్తున్నారని, వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండున్న కోర్సులనే బోధించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో నియమితులైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారన్న భావనతో పలు విశ్వవిద్యాలయాల్లో పెద్దగా ప్రాధాన్యం లేని కోర్సులను బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. వర్సిటీలు కొందరు ప్రొఫెసర్లకు రిహాబిలిటేషన్ సెంటర్లుగా మారొద్దని, అలాంటి వారికి అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ్యాల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను వీసీలు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. వర్సిటీలను తీర్చిదిద్దడానికి అవసరమైన నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.విశ్వవిద్యాలయాల ఉమ్మడి సమస్యలు, అలాగే వర్సిటీల వారిగా ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావుతో సమావేశమై చర్చించాలని, ఆయా అంశాలపై ప్రభుత్వానికి సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.






ఏది న్యాయం!? ఏది అన్యాయం!?

2 లో

ఇక 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

2 లో



## ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

**అవసరాని బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వర్చువల్ వైద్యసేవలు**
**వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

✍ జయభేరి, అమరావతి, ఏప్రిల్ 4 :

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్ధ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్ధ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ

...మిగతాది 2 లో

## ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదేం ఇందిరమ్మ రాజ్యం?

- అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్



✍ జయభేరి, హైదరాబాద్ ఏప్రిల్ 4:

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి ఫైరయ్యారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ సియూకు సంబంధించిన భూముల విషయంలో ఫేక్ ఫోటోలు, వీడియోలను బిఆర్ఎస్ ఐటి సెల్, కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేశారనే ఆరోపణలపై పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో హరీశ్ రావు.. కాంగ్రెస్ సర్కార్ పై ఎక్స్ వేదికగా తీవ్రంగా మండిపడ్డారు.

...మిగతాది 2 లో




## తెలంగాణలో బర్డ్ ఫ్లూ కలకలం

✍ జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 4:

లంగాణలో బర్డ్ ఫ్లూ మళ్లీ భయపెడుతోంది. బుధవారం హైదరాబాద్ నగర శివార్లలోని ఓ ఫౌల్ట్రీ ఫారమ్ లో బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణ కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేగింది. గత నాలుగు రోజుల క్రితం నగర శివారులోని ఓ ఫౌల్ట్రీలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. అధికారులు చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు.ల్యాబ్ నుంచి వచ్చిన టెస్టు ఫలితాల్లో బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో పౌల్ట్రీ ఫామ్స్ ను అధికారులు సీజ్ చేశారు. అందులో పనిచేస్తున్న

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## వక్ఫ్ సవరణతో పేదలకు న్యాయం

విస్తృత చర్చ, సంభాషణల ప్రాముఖ్యత మరోసారి ధృవీకరించబడిందని.. ఇలాంటివి అవసరమంటూ పేర్కొన్నారు..దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత లోపించిందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఇది ముఖ్యంగా ముస్లిం మహిళలు, పేద ముస్లింలు, పస్మాండ ముస్లింల ప్రయోజనాలకు హాని కలిగించిందన్నారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాలు పారదర్శకతను పెంచుతాయి.. ప్రజల హక్కులను కూడా కాపాడతాయని మోదీ పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయం, పారదర్శకతకు ఇది ఒక ముఖ్యమైన క్షణం. చాలా కాలంగా అణగదొక్కబడిన ప్రజలకు సహాయం లభిస్తుంది. వక్ఫ్ బిల్లు ప్రజలకు గొంతుకగా నిలవడంతోపాటు.. అవకాశం కల్పిస్తుందంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి. దాదాపు 12 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ తర్వాత ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 288 ఓట్లు, వ్యతిరేకంగా 232 ఓట్లు పోలయ్యాయి. దీని తరువాత రాజ్యసభలో ఈ బిల్లుపై సుదీర్ఘ చర్చ జరిగింది. దాదాపు 13 గంటల చర్చ తర్వాత, ఈ బిల్లును రాజ్యసభ కూడా ఆమోదించింది. రాజ్యసభలో ఈ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లు వచ్చాయి. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన తర్వాత, ఈ బిల్లును రాష్ట్రపతికి పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత ఇది చట్టంగా మారుతుంది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లును ఉభయ సభలలో ఆమోదించారన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును కొత్త ఉషోదయంగా అభివర్ణించారు. రాజ్యసభలో వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లు నేటి తరుణంలో అవసరమని అన్నారు. అందులో పారదర్శకత, జవాబుదారీతనం ఉన్నాయి. ఈ బిల్లు పేరు ఉమ్మీద్.. (ఆశ).. ఆశించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. ఈ బిల్లు ఏ మతానికీ వ్యతిరేకం కాదంటూ పేర్కొన్నారు. మంచి ఉద్దేశ్యంతోనే ఈ బిల్లును తీసుకువచ్చామని కిరణ్ రిజిజు అన్నారు. వక్ఫ్ బిల్లును జెపిసిలో వివరంగా చర్చించారు. 10 నగరాలను సందర్శించి బిల్లుపై ప్రజల అభిప్రాయాన్ని తీసుకున్నారు. అన్ని పార్టీలతో చర్చించిన తర్వాతే బిల్లును రూపొందించారు. వక్ఫ్ బిల్లుపై కోటి మందికి పైగా ప్రజలు సూచనలు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తిపై కొనసాగుతున్న వివాదం కారణంగా ఈ బిల్లు అవసరం. ఈ బిల్లుకు సంబంధించి 284 సంస్థలతో చర్చలు జరిగాయి. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ చేయలేనిది మోడీ ప్రభుత్వం చేస్తోంది.. అంటూ పేర్కొన్నారు.

## సోనియాని మందలించిన స్పీకర్

సభ్యురాలు తప్పుడు వ్యాఖ్యలు చేయడం ‘అత్యంత దురదృష్టకరం’ అని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవానికి భంగకరం అని ఓమ్ బిర్లా అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ అంశాన్ని లేవనెత్తి దీనిపై రూలింగ్ ఇవ్వవలసిందిగా స్పీకర్‌ను కోరిన తరువాత ఓమ్ బిర్లా రాజ్యసభ సభ్యురాలైన సోనియా గాంధీ పేరు ప్రస్తావించకుండా ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఆక్షేపించారు. గురువారం ఢిల్లీలో సంవిధాన్ సదన్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియా ప్రసంగిస్తూ, ‘బుధవారం వక్ఫ్ సవరణ బిల్లు 2024ను లోక్‌సభలో ఆమోదించారు. గురువారం అది రాజ్యసభలో ప్రస్తావనకు రానున్నది. బిల్లును దుందుడుకు ధోరణితో ఆమోదించారు. మన పార్టీ వైఖరి సుస్పష్టం. బిల్లుతో రాజ్యాంగంపైనే దాడి చేయడమే అవుతోంది. మన సమాజాన్ని శాశ్వతంగా విభజిత స్థితిలో ఉంచేందుకు బిజెపి వ్యూహంలో అది భాగం’ అని విమర్శించారు. ఈ విషయమై రూలింగ్ ఇవ్వాలని రిజిజు విజ్ఞప్తి చేయడంతో ఓమ్ బిర్లా మాట్లాడుతూ, ఈ సభలో సభ్యురాలు కాని, రెండవ సభలో ప్రస్తుతం సభ్యురాలు అయిన కాంగ్రెస్ సీనియర్ సభ్యురాలు ఒకరు వక్ఫ్ (సవరణ) బిల్లును దుందుడుకు ధోరణితో ఆమోదించుకున్నారని పార్లమెంట్ భవన సముదాయంలో వ్యాఖ్యానించారని తెలిపారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై దిగువ సభలో 13 గంటల 53 నిమిషాల సేపు చర్చ జరిగిందని, వివిధ పార్టీలకు చెందిన పలువురు సభ్యులు చర్చలో పాల్గొన్నారని ఓమ్ బిర్లా గుర్తుచేశారు. ‘బిల్లుపై మూడు సార్లు వోటింగ్ జరిగింది. సభ నిబంధనావళి ప్రకారం అది ఆమోదం పొందింది. సభ రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు సమావేశమై, సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లును ఆమోదించినప్పటికీ ఒక సీనియర్ సభ్యురాలు సభా కార్యకలాపాలపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం అందుకే అత్యంత దురదృష్టకరం. అది సముచితం కాదు’ అని ఓమ్ బిర్లా పేర్కొన్నారు. ‘అది పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవానికి విరుద్ధంగా ఉంది’ అని ఓమ్ బిర్లా అన్నారు.

## తెలంగాణలో బర్డ్ ఫ్లూ కలకలం

వారందరి శాంపిల్స్ సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ నేపథ్యంలో కోళ్లతోపాటు కోడి గుడ్లను కూడా ఎవరికీ అమ్మొద్దని ఫౌల్ట్రీ యాజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలోని అధిక శాతం చికెన్ దుకాణాలకు కోళ్లు, కోడి గుడ్లు నగర శివార్లలోని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫౌల్ట్రీ ఫామ్ ల నుంచి సరఫరా అవుతుంటాయి. ప్రస్తుతం నగర శివార్లలోని ఫౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ కలకలం రేగడంతోపాటు.. పలు ఫామ్ లలోని కోళ్లు బర్డ్ ఫ్లూ కారణంగానే మరణించినట్లు నిర్ధారణ కావడంతో నగరంలోని చికెన్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రస్తుతం బర్డ్ ఫ్లూగా నిర్దారణ అయిన అబ్దుల్లా పూర్ మెంట్ ఫౌల్ట్రీ ప్రాంతాన్ని అధికారులు రెడ్ జోన్ గా ప్రకటించినట్లు తెలుస్తోంది. ఆయా ఫామ్స్ లో ఉన్న కోళ్లను అధికారులు జాగ్రత్తగా పూడ్చిపెట్టారు. ఆ ప్రాంతంలో ఐదు కిలో మీటర్లు వరకు రెడ్ జోన్ గా ప్రకటించారు. ఇదిలాఉంటే.. బాగా ఉడికించిన చికెన్, కోడిగుడ్లు తినడం వల్ల వ్యాధి సోకే అవకాశాలు ఏమాత్రం లేవని వైద్య నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. సాధారణంగా ఈ వైరస్ లు మనుషుల్లోకి ప్రవేశించవు. ఒకవేళ ఈ వ్యాధి వస్తే జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందితోపాటు కడుపు నొప్పి, వాంతులు, అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బర్డ్ ఫ్లూ వైరస్ సోకకుండా ఉండాలంటే.. బాగా ఉండికించిన తరువాత మాత్రమే చికెన్, గుడ్లు వంటివి తినాలి. ఉడికించని పక్షి మాంసాన్ని ఇతర ఆహార పదార్థాలకు దూరంగా ఉంచడం మేలు. ఫౌల్ట్రీ రంగంలో పనిచేసేవారు వ్యక్తిగత శుభ్రత కచ్చితంగా పాటించాలి. కోళ్ల ఫారమ్ లలో పనిచేసేటప్పుడు చేతులకు కచ్చితంగా తొడుగులు వేసుకోవటం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవటం, ఎన్ 95 మాస్కులు ధరించడం, పీపీఈ కిట్లు, కళ్లజోళ్లు వాడటం ద్వారా వైరస్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

## ఇదెక్కడి ప్రజాస్వామ్యం?

“బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ పై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరిస్తున్నాం. హెచ్ సియూ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకు విద్యార్థులు, బిఆర్ఎస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు బనాయించారు. నేడు నల్లగొండ జిల్లా, మర్తినేని గూడెం మాజీ సర్పంచ్ బండమీది రామును అక్రమంగా పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఇలా ఎంతమందిపై కేసులు పెట్టుకుంటూ వెళ్తారు రేవంత్ రెడ్డి గారు?. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడతారా?. ఇదెక్కడి ప్రజాస్వామ్యం?.. ఇదేం ఇందిరమ్మ రాజ్యం?. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. మీ పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నాం. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, దివ్యాంగులకు.. ఇలా అన్ని వర్గాల ప్రజలకు మీరు ఇచ్చిన హామీలను అమలు చేయించే దాకా బిఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టదు. ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలదీస్తాం. ప్రజాక్షేత్రంలో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం” అని ఆయన హెచ్చరించారు.

## 100 పడకల ఆస్పత్రి

స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని, ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్య,వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా చెప్పిన ముఖ్యమంత్రి...గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. అన్యారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి...ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, దయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలావరకు బయటపడవచ్చన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు.

# ఏది న్యాయం!? ఏది అన్యాయం..!?

**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనలు.. ఒకవైపు అభివృద్ధికి పరుగు ఇంకోవైపు వన్య జీవ ప్రాణుల అరుపు... ఏది న్యాయం!? ఏది అన్యాయం..!? తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలలో కెసిఆర్ ప్రభుత్వం, ప్రభుత్వ ఖజానాను పూర్తిగా అమ్మి వేశారని అప్పుడు ప్రతిపక్ష పార్టీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గగ్గోలు పెట్టింది.**



హైదరాబాద్ చుట్టూ పరిసర ప్రాంతాల్లో ఉన్న భూములన్నీ గుంటనక్కల చేతుల్లోకి వెళ్లొద్దు అన్న ఉద్దేశంతోటే.. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ చేతుల్లోకి వచ్చిన తర్వాత.. 20 ఏళ్లుగా కోర్టులో కొట్లాడి తెలంగాణ ప్రభుత్వం సాధించుకుంది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ సాక్షిగా ఇక్కడ ఐటీ కారిడార్ కడతామని చెప్పడం చర్చనీయంగా మారింది. అభివృద్ధికి ఎవరు అడ్డం రావద్దు అని మాట్లాడడం సర్వత్రయిప్పుడు విమర్శలకు దారితీస్తోంది.. ఇక అసలు విషయానికి వస్తే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇక్కడ దాదాపు 400 ఎకరాల భూమిని తెలంగాణ గవర్నమెంట్ అన్ని హక్కులు తమకే చెందడంతో ఈ భూమిని అక్కడ అడవి లేకుండా చేస్తూ ఐటి కారిడార్ చేయాలని కార్యాచరణ చేపట్టింది. అసలు సమస్య ఇక్కడే ఉంది. నిజానికి సెంట్రల్ యూనివర్సిటీకి ఈ భూమి ఎలా వచ్చిందో ఒక్కసారి తెలుసుకుందాం.

**2003లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఉన్నప్పుడు హెచ్ సి యూలో 400 ఎకరాలను ఐ ఎం జి కి అగ్రిమెంట్ చేసింది. ఇక ఐ ఎం జి తో చేసుకున్న అగ్రిమెంటును వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో దాన్ని రద్దు చేసింది. ఆ తర్వాత తెలంగాణ విడిపోవడం కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడడం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం. ఈ మధ్యలో ఐ ఎం జి తో సివిల్ కోర్టులో పోరాడిన తెలంగాణ ప్రభుత్వం చివరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ భూమిని తన సొంతం చేసుకోగలిగింది. అందుకే ఈ భూమి తెలంగాణ గవర్నమెంట్ కే చెందుతుంది. కానీ విద్యార్థులకు గాని అక్కడ యూనివర్సిటీకి గానీ ఎలాంటి హక్కులు లేవు అనేది వాస్తవం. అయితే ప్రస్తుతం హైదరాబాదులో జనాభా ఎక్కువగా రావడం, ఇక్కడ అనేక రకాలైన పర్యావరణ సమతుల్యత కోల్పోవడం రోజురోజుకు పెరుగుతున్న ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ గవర్నమెంట్ ఏకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాలను ఐటి కారిడార్కు దారా దత్తం చేసేలా చర్యలు తీసుకోవడంపై విద్యార్థులు విద్యార్థి సంఘాలు ప్రతిపక్ష పార్టీలు ఏకమై పెద్ద ఎత్తున భారీ ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నాయి.**

వాస్తవానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వందల సంఖ్యలో వన్యప్రాణులు నెలవు. ఇక్కడ జింకలు తాబేలు ఇలాంటి ఎన్నో ప్రకృతి నేస్తాలు నివసిస్తూ ఉన్నాయి. 400 ఎకరాల్లో అక్కడక్కడ కుంటలు గుట్టలు కొండలు అనేక రకాలైన చెట్లు అడవిని తలపించే విధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉంది. ఇక్కడ బుల్డోజర్లతో పని జరుగుతున్నప్పుడు అందులో నివసించే మిమల్ని వాటి అరుపులు వింటే ఎవరికైనా మనసు ద్రవించక మానదు. జింకలు ఎటెల్లాలో అర్థంకాక తికమక పరిస్థితుల్లో వాటి బ్రతుకుతెరువు అగమ్య గోచరంగా మారుతుంది.

ఇదంతా విద్యార్థులకు ఈ సమాజానికి కనిపిస్తుంది. కానీ ప్రభుత్వానికి కనిపించడం లేదనేది వేయి డాలర్ల ప్రశ్న. నిజానికి సీఎం రేవంత్ రెడ్డి నిండు శాసనసభలో ఇక్కడ కొన్ని గుంట నక్కలు ఈ భూమిని కాజేయడానికి ఎదురుచూస్తున్నాయని చెప్పడం, ఇప్పుడు సర్వత్ర విమర్శలకు దారి తీస్తోంది. ఒకవైపు విద్యార్థులు తగ్గేదే లేదు అంటూ అనేకరకాలుగా ఉద్యమాలు చేస్తూ యూనివర్సిటీ భూమిని కాపాడడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకోవైపు ప్రభుత్వం ఇది యూనివర్సిటీకి సంబంధం లేదు, అక్కడ వన్యప్రాణులు లేని లేవు అని చెబుతూ కచ్చితంగా అభివృద్ధికి తోడ్పడే విధంగా కార్యక్రమం చేస్తామని చెప్పడం ఇంకో వైపు చూస్తున్నం...

**ఇదే ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బొంబాయిలో పర్యావరణ పరిరక్షణకు ఆటంకం కలిగినప్పుడు అటు రాహుల్ గాంధీ కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి గాని ఘాటు విమర్శలు చేయడం ఎవరు మర్చిపోలేదని కేటీఆర్ మండిపడుతూ విద్యార్థులకు మద్దతు తెలుపుతున్నాడు. కానీ ముఖ్యమంత్రి గ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారిపోయాడని ఎద్దేవా చేస్తున్న నేపథ్యంలో... విద్యార్థులను పావులుగా వాడుకుంటుందా ప్రతిపక్షం? అనేది ఇక్కడ ఆలోచించాల్సిన విషయం. నిజానికి హైదరాబాద్ యూనివర్సిటీ దీని రూపురేఖలు మారిపోతే ఖచ్చితంగా హైదరాబాదులో వాతావరణ కాలుష్యం రాక మానదు. నెమళ్ల అరుపులు జింకల ఉరుకుల పరుగులు వన్యప్రాణుల ఘోషలను ఎవరు పట్టించుకోవడం లేదనేది మానవియ కోణంలో ఆలోచించాల్సిన విషయం. ఇప్పటికే హైదరాబాదులో కాలుష్యం 170 కి చేరిన నేపథ్యంలో ఇలాంటి ప్రకృతి సంపదను నాశనం చేస్తూ పోతే హైదరాబాదులో వాతావరణ కాలుష్యం అధిక మోతాదులో నమోదు అవ్వక తప్పదు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించకుండా ఇలాగే చేసుకుంటూ పోతే మిగిలేది శూన్యమే అంటూ అనేక పర్యావరణ సంఘాలు ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నాయి.**

హైదరాబాదులో మిగిలిన కేబీఆర్ పార్క్ 390 ఎకరాల్లో విస్తీర్ణం ఉండగా హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీ 1580 ఎకరాల్లో ఆనాడు నిర్మితం చేశారు. ఇది 1974లో పార్లమెంట్ ఆమోదం పొందిన తరువాత ఈ భూమి అధికారికంగా ప్రభుత్వం పేరు మీద కి మారింది. చరిత్ర ఎన్నడూ మారని విధంగా ఉంటుంది. కానీ అభివృద్ధి పేరుతో ఇలా పర్యావరణం



✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిసిస్టు, కవి, రచయిత, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు

పాడు చేయడం అక్కడ నివసిస్తున్న అనేక మూగ జీవాల ఉసురును పంచుకోవడం ముమ్మాటికి ఇది మంచిది కాదు అని పర్యావరణ ప్రేమికులతో పాటు యూనివర్సిటీ విద్యార్థులు గత ఐదు ఆరు రోజులుగా ఆందోళన కార్యక్రమాలకు దిగుతున్నారు. ఇంకవైపు పోలీస్ బందోబస్తు విద్యార్థులను అరెస్టు చేస్తూ అక్కడ బుల్డోజర్లతో పనులు చకచగా జరిగిస్తున్నారు.. ఏది ఏమైనా పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సజావుగా సాగుతుంది.

సీఎం రేవంత్ రెడ్డి పగలు ప్రతీకారాలకు పోయి గత ప్రభుత్వం చేసిన విది విధానాలనే మరల ఇతరులు చేస్తూ పోతే భవిష్యత్తులో తెలంగాణలో భారీ కరువు కాటకాలకు నెలవుగా మారడం తప్పదు. ఇప్పటికే తెలంగాణ ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో ప్రతి జిల్లాల్లో అడవుల్లో ఆవాసం లేక కోతులు గృహ అవసరాల్లో ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇది మరవకముందే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న అనేక జీవరాశులకు ఇప్పుడు ఆశ్రయం లేకుండా పోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి మానవీయ కోణంలో ఆలోచించాలి.




## ఇక 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

- గంటల కొద్ది వేచి ఉండాల్సిన అవసరం లేదు
- స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్
- ప్రస్తుతం 26 జిల్లా కేంద్రాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభం
- 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా అమలు

✍ **జయభేరి, అమరావతి:**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ హరి నారాయణ, అడిషనల్ ఐజీ ఉదయ భాస్కర్, జాయింట్ ఐజీలు రవికుమార్, సరోజలతో కలిసి స్లాట్ బుకింగ్ అవగాహన కరప్రతాన్ని, పోస్టర్ ను మంత్రి సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ అధికారిక వెబ్ సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి కొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్ష్యులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమకు కుదిరిన సమయాల్లో వచ్చి పని పూర్తి చేసుకోవచ్చన్నారు. స్లాట్ ఆధారిత అపాయింట్మెంట్లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయన్నారు. ఈరోజున మొత్తం 26 జిల్లా ప్రధాన కార్యాలయాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, మొత్తం 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అన్లైన్ లో డేటా ఎంట్రీ చేసి డాక్యుమెంట్ ప్రీపేర్ చేసుకొని ఫీజు కూడా కట్టేసి ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుందన్నారు. ఒక వేళ స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోయిన వారు సబ్ రిజిస్టార్ ఆఫీసుకు వస్తే సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ. ఐదు వేల రూపాయల ప్రత్యేక ఫీజు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా వరుసగా వచ్చిన మూడు రోజుల సెలవుల్లో దాదాపు రూ.74 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ ఆదాయం లభించిందన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమ్యూటేషన్ను సులభతరం చేయడం కోసం రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్ ను రెవెన్యూ డేటాబేస్ తో అనుసంధానం చేశామన్నారు. MA & UD, DTCP వంటి ఇతర శాఖలతోనూ అనుసంధానం ప్రారంభించామని, ఈ ప్రక్రియ 2025 ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. ఈ అనుసంధానంతో ఆస్తిపై యాజమాన్యం ఉన్న వ్యక్తి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయగలుగుతారని చెప్పారు. డబుల్ Registration, impersonation, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి లాంటి రియల్ ఎస్టేట్ మోసాలను నివారించేందుకు శాఖ అనేక చర్యలు తీసుకుందన్నారు. Aadhaar సేవలను Registration ప్రక్రియలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. డాక్యుమెంట్లను సమర్పించినప్పుడు పార్టీల డిజిటల్ సంతకాలు కూడా తీసుకోబడతాయని, ఈ విధంగా Aadhaar ఆధారంగా Registration లో ఆధారిత గుర్తింపును ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ నుండి ప్రశంసలు అందుకున్నామని చెప్పారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న, భూయజమానులకు ఇబ్బందిగా ఉన్న నాలా యాక్ట్ ను రద్దు చేస్తున్నామన్నారు. 2024, 25 ఏడాదికి రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిందని అవినీతి పత్రిక సాక్షి వార్తలు రాసిందని, అయితే డబ్బు కోసం గడ్డితినే ప్రభుత్వం మాది కాదని అన్నారు. పేదల అభ్యున్నతి తోపాటు, అభివృద్ధిని కూడా సాధిస్తూ ఆదాయాన్ని పెంచుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం భూ అరచాకాలు చేసిందని, ఫ్రీ హోల్డ్ పేరుతో పెద్ద కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోదియా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా అవినీతి తగ్గిపోయి పారదర్శకత పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఫేస్ లెస్, పేపర్ లెస్, క్యాష్ లెస్ గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది తమ లక్ష్యమని చెప్పారు.

**స్లాట్ బుకింగ్ విధానం ఇలా:**

రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్ సైట్ registration.ap.gov.in లోని పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా డేటా అంతా ఎంట్రీ చేసి అప్లికేషన్ నెంబర్ ను పొందాలి. ఆ తర్వాత స్లాట్ బుకింగ్ మాడ్యూల్ లో అప్లికేషన్ నెంబర్ ను ఎంటర్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆరోజు నుండి 15 రోజుల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ 15 రోజుల్లో ఖాళీగా ఉన్న స్లాట్ ను డైనమిక్ గా వెబ్ సైట్ ఎప్పుడూ చూపిస్తూ ఉంటుంది.

# ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి శ్రీధర్ బాబు
- రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి
- పెట్టుబడులు, పరిశ్రమల రాకతో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు
- వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ మేళా
- జాబ్ మేళా ను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కి అభినందనలు తెల్పిన మంత్రి
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కు విశేష స్పందన




**జయభేరి, పరకాల, ఏప్రిల్ 04:**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి దశల వారీగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గ యువతీ యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగావకాశాల కల్పన కు మెగా జాబ్ మేళాను నిర్వహించాగా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకముందు వివిధ కంపెనీలు జాబ్ మేళాలో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే లు, కలెక్టర్లు పరిశీలించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఆకాంక్ష తో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను గుర్తించి దశల వారీగా 2లక్షల ఉద్యోగాలను కల్పించాలని ఉద్దేశంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ,ఐటిఐ, డిప్లొమా, బీటెక్ చదివిన నిరుద్యోగ యువత దాదాపుగా 25 నుంచి 30 లక్షల వరకు ఉంటారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలబడాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళాలను ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగం లోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేతో పాటు వివిధ శాఖల అధికారులు ఈ మెగా జాబ్ మేళా ను నిర్వహించేందుకు తోడ్పడ్డారని తెలిపారు. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. 50 కి పైగా వివిధ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో స్కిల్ యూనివర్సిటీని దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో నెలకొల్పిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగానికి దాదాపు మూడు వేల మంది వరకు పోటీ పడుతున్నారని, మిగతావారు నిరాశ పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగ అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని భావనతో రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చినట్లయితే తద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. హైదరాబాదులో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ముందుకెళ్తుంటే కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర యువత భవిష్యత్తు పట్ల పరిశ్రమలను తీసుకువచ్చి తద్వారా లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు కానున్న డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ని పెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. గ్రూప్ 1 పరీక్షలను తమ ప్రభుత్వం త్వరలోనే గ్రూప్ 1 అధికారులు బాధ్యతలను చేపట్టనున్నారని పేర్కొన్నారు. వివిధ గ్రూప్స్ పరీక్షల నిర్వహించి 57వేల మందికి ఉద్యోగాలను కల్పించినట్లు చెప్పారు మెగా జాబ్ మేళా నిర్వహించి వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలను కల్పించే విధంగా కృషి చేసిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. మెగా జాబ్ మేళా కు పెద్ద ఎత్తున హాజరైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల ను కల్పించాలనే సంకల్పంతో మెగా జాబ్ మేళా ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు లోను ఉద్యోగ, ఉపాధి అవకాశాల ను కల్పిస్తామన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేవిధంగా కృషి చేస్తామన్నారు. రాబోయే నాలుగేళ్ల లోనూ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పన అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. నిరుద్యోగ యువత ఆయా గ్రామాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మెగా జాబ్ మేళా లో వివిధ కంపెనీలు ఐదు వేలకు పైగా ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. భూపాలపల్లి లోను ఈ నెల 26వ తేదీన మెగా జాబ్ మేళా ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా లో పాల్గొన్న వివిధ కంపెనీలు అర్హతలను బట్టి ఇంటర్వ్యూలలో ఆఫర్ లెటర్లను మంత్రి శ్రీధర్ బాబు , ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద తదితరుల చేతుల మీదుగా ఎంపికైన అభ్యర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఐనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, డీఎఫ్ వో అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.





## అధినేత కేసీఆర్ పార్టీ ముఖ్య నేతల సమావేశం

**జయభేరి, ఉప్పల్ :**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో అధినేత కేసీఆర్ అధ్యక్షతన, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం జరిగింది. శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు షంభీపూర్ రాజు, నవీన్ రావు, వాణి దేవి, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కె.పి. వివేకానంద, మాధవరం కృష్ణారావు, పద్మ రావు గౌడ్, మాగంటి గోపీనాథ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి, డా. మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి మరియు బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి, ముఠా జయసింహ, మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్, మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, కుమారి నివేదిత సాయన్న, పంజుగుల శ్రీశైల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వావ్ కిడ్స్ అండ్ ఇంటెల్లిటాట్స్ ప్లే స్కూల్ ప్రారంభం



**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్ న్యూ భవానినగర్ మదర్ తెరిసా హైస్కూల్ దగ్గర నూతనంగా స్థాపించిన వావ్ కిడ్స్ అండ్ ఇంటెల్లిటాట్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. స్కూల్ ప్రిన్సిపాల్ ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే ప్రిన్సిపల్ ప్రియాంక రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసారు.

## డ్రైనేజీ నీరు తాగుతున్న కాలనీవాసులు

- బిజెపి ఏనుగు సుదర్శన్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయోధ్య నగర్, సుమా రెసిడెన్సీ కాలనీలలో కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న కాలనీవాసులను, నిన్న మేడ్చల్ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా డ్రైనేజీ నీటితో సహవాసం చేస్తూ, గత వారం రోజుల నుండి తాగునీటి పైపులైను యందు డ్రైనేజీ వాటర్ కలవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు రెండు కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ ఫోన్ ద్వారా అడిగి సమాచారం తెలుసుకున్నారు. కాలనీ వాసుసులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా అవి తన సమస్యగా భావించి, స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సహకారంతో ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి ఈస్ట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, BJYM అధ్యక్షులు పవన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుల పల్లె బాలరాజు గౌడ్, కాలనీ వాసులు పెద్దా ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ మైసమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణ పరిధిలోని మద్దేలమ్మ ఆలయంలో నిర్వహించిన శ్రీశ్రీ శ్రీ మైసమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో కలిసి అమ్మవారిని దర్శించుకోని వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఎమ్మెల్యే ని ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేసి,శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవరకొండ నియోజక వర్గ ప్రజలంతా సుఖశాంతులతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని శ్రీ శ్రీ మైసమ్మ తల్లి అమ్మవారిని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో PACS చైర్మన్లు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు,ప్రజా ప్రతినిధులు,పట్టణ కౌన్సిలర్లు,వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,యాదవ సంఘ నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సెక్రెటరీగా శివలింగు కృష్ణ

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 04 :**

సిద్ధిపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలలో ఏఐటియుసి సిద్ధిపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సెక్రెటరీగా గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామానికి చెందిన శివలింగు కృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నన్ను ఎంపిక చేసిన భవన నిర్మాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్కెట్ ప్రవీణ్ కుమార్, సిపిఐ పార్టీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎఐటియుసి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణపురం లక్ష్మణ్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాల్లో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై కృషి చేస్తానని వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని పేర్కొన్నారు.

## ఉప్పల్లో ఎన్నాళ్ళు ఈ తిప్పలు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ

**జయభేరి, మేడ్చల్ :**

ప్రారంభించి ఏడు సంవత్సరాలైనా ఎలివేటెడ్ కారిడార్ పనులు... నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ తిప్పలు ఎన్నాళ్లని అఖిలపక్షం అధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్ కి రావాలంటేనే ట్రాఫిక్ తో..జనం భయపడిపోతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేసారు.

## గౌడవల్లిలో కుక్కల స్వైర విహారం


- వాహనాల వెంటపడి పరుగుపెట్టిస్తున్న వీధికుక్కలు
- గాయాలపాలవుతున్న చిన్నారులు, వాహనదారులు

**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు ప్రజలను తీవ్రభయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పగలురాత్రి తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం గౌడవల్లి గ్రామంలో వీధి కుక్క ఒక్కసారిగా ముగ్గురిపై విచక్షణ రహితంగా దాడి చేసింది. ఈ దాడిలో మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి,



బీహార్ రాష్టానికి చెందిన తల్లి కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన బాలుడిని



చికిత్స నిమిత్తం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని కిరణ దుకాణానికి బీహార్ కు చెందిన మహిళ తన కుమారుడితో కలిసి వచ్చింది. ఇదే సమయంలో అటువైపు వచ్చిన వీధి కుక్క ఒక్కసారిగా ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు దాడికి పాల్పడిన కుక్కను వెంబడించి కొట్టి చంపేశారు.

## ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులకు అధిక దిగుబడి

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 04 :**



ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు అధిక దిగుబడి, ఆర్థిక ప్రయోజనం ఉంటుందని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిద్ధిపేట జిల్లా అక్కారం శివారులోని రైతు లక్ష్మణ్ సాగు చేసిన ఆయిల్ పంట మొదటి కోతను ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలిసి కోసిన సందర్భంగా వారు మాట్లాడారు. పంట సాగు చేసి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా మొదటి కోత ప్రారంభించగా, మార్కెట్లో ప్రస్తుతం టన్నుకు రూ 21 వేలకు పైగా మద్దతు ధర రానున్నట్లు స్పష్టం చేశారు. ఈ పంట రైతులకు మంచి లాభదాయక పంట కాగా, ప్రభుత్వం నుండి మొక్కలకు, డ్రిప్ పరికరాలకు నాలుగేళ్ల పాటు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన, ఇతర సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగులో అంతర పంటలు సాగు చేసి లాభం పొందవచ్చని, అలాగే ఇతర నూనె గింజల పంటలు సాగుతో పోల్చితే తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి, నూనె ఉత్పత్తి పొందవచ్చని చెప్పారు. ముఖ్యంగా ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు గణనీయమైన ఆదాయం అందించనుండగా, దేశవ్యాప్తంగా నూనె అవసరాలను తీర్చడానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు మన నేలలు అనుకూలం కాగా, పంటలు జీవవైద్యాన్ని కూడా పెంచుతాయని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పంట సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలు జ్యోతి, మాధవి, ఫిల్డ్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్ టైల్ పార్క్ లో స్థానికులకు ఉద్యోగాలలో ప్రాధాన్యతనివ్వాలి

- మంత్రి శ్రీధర్ బాబు
- అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 04:**

శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి , శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ, కె ఆర్ నాగరాజు ,సిపి సన్ ప్రీత్ సింగ్ , వరంగల్ హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద ,పి ప్రావీణ్య , కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తో కలిసి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు.కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లోని ఇండస్ట్రీల్లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు గాను స్కిల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా స్థానికులకు నైపుణ్యం కల్పించి నియమించు కోవాలని అన్నారు. యంగ్ వన్, గణేష ఈకో టెక్స్టైల్స్ కంపెనీల ద్వారా నిర్వహణ గురించి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిఐఐసి) డైరెక్టర్ ధరణికాంత్ మంత్రికి వివరించారు. ఆర్ అండ్ ఆర్ లేఔట్ లో పట్టాలిచ్చిన 863 రైతులకు వారి అభ్యర్థన మేరకు 50 గజాల నుండి 75 గజాలకు అందించుటకు టిజిఐఐసి ద్వారా అదనంగా రెండు ఎకరాల భూమి కేటాయించినందున వెంటనే తిరిగి లే అవుట్ ప్లాట్లు చేసి రాజీవ్ గాంధీ టౌన్ షిప్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో చేపడుతున్న అభివృద్ధి గురించి అంతర్గతంగా బీటీ రోడ్లు పూర్తయ్యాయని, స్ట్రామ్ వాటర్ డ్రైన్, విద్యుత్ సప్లై పనుల టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని, ఆర్ అండ్ ఆర్ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశుసంవర్ధక శాఖ ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపగా. దీనికి అదనంగా కమ్యూనిటీ హాల్ కూడా ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

మైక్రో మినీ స్మాల్ ఇండస్ట్రీస్ (ఎంఎస్ ఎంఈ) జిడిపి పథకం క్రింద 10.10 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన కనీస మౌళిక వసతులైన రోడ్లు, డ్రైన్స్, మంచినీటి సరఫరా, సంప్, పరిపాలన భవనం నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని జులై 2025 నాటికి పూర్తవుతాయని తెలిపారు. వర్షాకాలంలో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో వరద నివారణ నిమిత్తం నాలా అభివృద్ధి పనుల పై సమీక్షిస్తూ లుజ్ సైల్ ఉన్నందున సాంకేతికపరంగా రీడిజైన్ చేసి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రీనరీపై సమీక్షిస్తూ రోడ్లకు ఇరువైపులా సెంట్రల్ మీడియంలో గుర్తించిన కొన్ని ప్రధాన ప్రాంతాల్లో అటవీ ఉద్యానవగల శాఖల సంయుక్త సంయుక్తంగా మొక్కలు నాటి పచ్చదనం పెంచనున్నట్లు కలెక్టర్ తెలుపగా దీనికి ఆయా పనులు వర్షాకాలం ప్రారంభం వరకు పూర్తి అవ్వాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సంగేమ్, గీసుకొండ మండలాల్లో గుడుంబాకు బానిసైన వారిని చైతన్యం కల్పించాలని శాసనసభ్యులు ప్రకాశ్ రెడ్డి కోరగా, గుడుంబా పై ముక్కు పాదం మోపాలని అందుకుగాను ఎక్సైజ్ పోలీస్ రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.దీనికి తోడుగా రిహాబిలిటేషన్ కేంద్రాల ద్వారా వారిలో అవగాహన కల్పించాలన్నారు. పరకాల నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోనీ మహిళకు గీసుగొండ సంగెమ్ మండలాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాల ద్వారా 51 బ్యాచెస్ లను ఏర్పాటు చేసి 17 17 మహిళలకు శిక్షణ కల్పించి శిక్షణ పూర్తి చేసుకున్న 82 మంది మహిళలకు మంత్రించేతుల మీదుగా ఈరోజు ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అశ్విని తనాజీ వాకడే, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు కైటెక్స్ యంగ్ వన్ గణేశా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కుటుంబం నుంచి పరిశోధనాకారుడిగా ఎదిగిన లింగమయ్య

- లింగమయ్యకు పలువురు శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకొండ :**

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో (ఓయూ) ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ECE) విభాగంలో పరిశోధకులుగా ఉన్న దగ్గు లింగమయ్య విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్ డీ డిగ్రీ ను పొందారు. ఆయన "ప్రోఆక్టివ్ ACO, రీఇన్ ఫోర్స్మెంట్ మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలను ఉపయోగించి WSN పనితీరు మెరుగుదల " అనే అంశంపై పరిశోధన చేసి విజయవంతంగా తన సిద్ధాంతాన్ని సమర్పించారు. దగ్గు l లింగమయ్య తన పరిశోధనను ఉస్మానియా విశ్వవిద్యాలయం RఅండD డా.డి. కృష్ణా రెడ్డి, డా.పి.నవీన్ కుమార్, బోర్డు ఆఫ్ స్టడీస్ గార్ల మార్గదర్శకత్వంలో నిర్వహించారు. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన దగ్గు లింగమయ్య వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు లింగమ్మ కోటయ్య రైతులుగా జీవనం సాగిస్తున్నారు. తన గ్రామంలో పిహెచ్ డీ పట్టా పొందిన మొదటి వ్యక్తిగా లింగమయ్య గుర్తింపు పొందారు. లింగమయ్య విజయాన్ని పురస్కరించుకొని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, హర్షం వ్యక్తం చేస్తూ లింగమయ్యకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

## డీవీకే మార్ట్ వినియోగదారులకు బహుమతులు

- శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డు డివికె మార్ట్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా లక్కీ డ్రా కార్యక్రమంలో పాల్గొని, డివికె మార్ట్ వినియోగదారులకు లక్కీడ్రా తీసి బహుమతులు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సీపీఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహా రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యునూస్, కౌన్సిలర్ జయ ప్రకాష్ రాజ్ ,శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీలు వెంకటయ్య,ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా పంపిణీ వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జయభేరి, కరీంనగర్ :**

రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా పంపిణీ వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యం సరఫరా పై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి లతో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 40 రూపాయలు పైగా కిలో బియ్యానికి వెచ్చించి ప్రజలకు ఉచితంగా సరఫరా చేశామని, చాలా పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ 70 నుంచి 80% వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదని, రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలకు, ఇతర అవసరాలకు తరలి వెళ్లేదని మంత్రి తెలిపారు. మన రాష్ట్రంలో అత్యధిక జనాభా దొడ్డు బియ్యం తినడం ఆపేసారని, దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం 84 శాతం జనాభాకు ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టామని అన్నారు. సన్న బియ్యం సరఫరా పంపిణీ విజయవంతం అవుతోందని, ప్రజలు సన్న బియ్యం సంతోషంతో స్వీకరిస్తున్నారని, 84 శాతం జనాభా ఆహార భద్రతకు సుస్థిరత ఏర్పడిందని అన్నారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా రవాణా వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్న బియ్యం రవాణా పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఏప్రిల్ 6న శ్రీరామ నవమి సందర్భంగా సీఎం భద్రాచలం వస్తారని, సన్న బియ్యం స్వీకరించిన దళిత గిరిజన కుటుంబాలతో కలిసి భోజనం చేస్తారని మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలో సైతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పేదలతో కలిసి ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యంతో భోజనం చేయాలని మంత్రి సూచించారు. 13 వేల కోట్లు ఖర్చు చేసి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని అన్నారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ. సన్న బియ్యం సరఫరా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా ప్రారంభించడం జరిగిందని, దీనికి కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కారణంగా రేషన్ షాపుల వద్ద ఒకేసారి డిమాండ్ పెరిగి పోతున్నందున బియ్యం రవాణా వేగవంతం చేయాలని, రేషన్ షాపుల వద్ద అవసరమైన మేర బియ్యం అందుబాటులో పెట్టాలని అన్నారు. సన్న రకం బియ్యం సరఫరా పై ప్రభుత్వ చిత్తశుద్ధి చాటేలా ప్రచారం కల్పించాలని అన్నారు. పేదల ఇంటికి సన్న బియ్యం సరఫరా అతి గొప్ప విజయమని అన్నారు. నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్క్రూటిని వేగవంతం చేయాలని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏడుగురు బీసీలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

- టీజీ. శ్రీనివాస్ బీసీ సమాజ్ నాయకుడు

**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 04 :**



జనాభా ప్రాతిపదికన తెలంగాణ మంత్రిమండలిలో ఉండాల్సిన 9 54% మంది బీసీలకు కనీసం ఏడుగురికైనా 42% అవకాశం కల్పించాలి అని బీసీ సమాజ్ రంగారెడ్డి జిల్లా నాయకుడు టీ.జి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, ఉపాధి, చట్టసభల్లో ప్రాథినిత్యం కల్పించాలని భారత రాజ్యాంగం చెబుతుంది. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అంటూ నిన్నదిస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బీసీలకు లోక్ సభ, రాజ్యసభ, శాసనమండలి, శాసనసభ, మంత్రి పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలి. లేనిపక్షంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్కు అనుగుణంగా అన్నిరంగాలలో 42% రిజర్వేషన్ లు అమలు చేయాలి. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారీ అగ్రవర్ణాలుగా చెప్పుకుంటున్న కొన్ని ఆధిపత్య అల్పసంఖ్యాక వర్గాలు చట్టసభల్లో లోక్ సభ మరియు శాసనసభల్లో 50% పైగా సీట్లను తీసుకుంటూ, రాజ్యసభ మరియు శాసన మండల్లో నామినేటెడ్ పదవులలో, మంత్రిమండలిలో కూడా సుమారు 60 70% స్థానాలను తీసుకుంటున్నాయి. అంతేకాకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పేరుతో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో జనాభాకు రెట్టింపు శాతం 10% రిజర్వేషన్స్ పొందుతున్నాయి. అత్యధిక జనాభా ఉన్న బీసీ వర్గాలు మాత్రం విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో దేశ జనాభాలో సగం కన్నా ఎక్కువగా ఉన్నా విద్యా, ఉద్యోగాల్లో కేవలం 27% రిజర్వేషన్ను పొందుతూ చట్టసభల్లో లోక్ సభ మరియు శాసనసభల్లో 20 శాతానికి మించి ప్రాతినిత్యం లేకపోవడమే కాకుండా రాజ్యసభ మరియు శాసన మండల్లలో కనీసం 20% సభ్యులను కూడా కలిగి ఉండకపోవడమంటే అన్ని రాజకీయ పార్టీలు బీసీల రాజ్యాంగబద్ధ హక్కులను హరించడమే కాకుండా మెజారిటీ ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుంది. తెలంగాణలో 54 శాతం పైగా ఉన్న బీసీలకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలులో భాగంగా 42% రిజర్వేషన్ ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము 42% మంత్రి పదవులను కూడా కేటాయించి జై సంవిధాన్ అన్న తన నినాదాన్ని నిలుపుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వంలో మొత్తం 18 మంత్రి పదవులలో జనాభా ప్రాతిపదికన 9 మంత్రి పదవులు బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాలని అనుకున్నా బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వము మొత్తం 7గురు బీసీ మంత్రులైనా మంత్రి మండలిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు..

# ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**




పరవాడ.గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.పరవాడ మండలం పరవాడ గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని , ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం గని శెట్టి మాట్లాడుతూ రూ 600 రోజుకి వేతనం చెల్లించాలని పే స్లిప్పులు ఇవ్వాలని గని శెట్టి డిమాండ్ చేశారు. చేసిన పనులకు మండలంలో రెండు కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించకపోవడంతో కూలీల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూలిలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లెదన్నారు గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిదులకు కోత విదించి మేటిరియల్ చార్జీలు పెంచేసారని తెలిపారు దింతో ముందుగా కాంట్రాక్టర్లుకు బిల్లులు ముందు చెల్లించి కూలీలను తర్వాత చెల్లిస్తున్నారని తెలిపారు, 40 శాతం సమ్మర్ ఎలవెన్సులు అధికంగా చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, మంచినీరు, ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తట్టా, పారా, గునపాపం టెంట్లు వంటి వాటికి కోత పెట్టారని తెలిపారు. రవాణా చార్జీలు కూడా ఎత్తివేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కార్మికులు అడ్డుకోవాలని గని శెట్టి పిలుపునిచ్చారు. కేటాయిస్తున్న నిధులు కూడా 2019 20 లో 71 వేల కోట్లు కేటాయించగా 2024 కి వచ్చేసరికి పెంచకపోగా రూ 68వేల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ కార్మికులు ఐక్యంగా పోరాడి పథకాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, ఆదిలక్ష్మి, అప్పారావు, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి స్పందన

- అనైతిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

**జయభేరి, నల్గొండ:**



ఇల్లీగల్ దందాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. నియోజకవర్గంలోని నకిలీ మద్యంపై స్పందించారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి, విషయం తన దృష్టికి రాగానే సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడానని తెలిపారు. ఇల్లీగల్ దందాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీలో సన్న బియ్యం పంపిణి కార్యాక్రమాన్ని ప్రారంభించి మహిళలకు సన్న బియ్యం చేతిలో పోసి బియ్యం నాణ్యతను చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అనడానికి రుజువే నిరు పేదలకు సన్న బియ్యం పంపిణీ అన్నారు. దేశంలోనే సన్న బియ్యం పంపిణీ తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతుందని ఈ ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేవారు తినడానికి కొంత ఇబ్బందిగా ఉండేదని,ఆ ఇబ్బందిని గుర్తించి ఇప్పుడు ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు..బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని,అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులు ఇస్తుందన్నారు. సన్న బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు కూడా అందిస్తాంమన్నారు. నియోజకవర్గం లో ఇల్లీగల్ బెల్ట్ షాపుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని,నకిలీ మద్యం తయారీ విషయంలో ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదన్నారు.చివరికి రాజగోపాల్ రెడ్డి అయిన సరే తన పార్టీ వ్యక్తులనైనా ఉపేక్షించేది లేదన్నారు. అనైతిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



## నలభై ఏళ్లగా ఆ ఇంట్లో సీతారాముల కళ్యాణం

**జయభేరి, హైదరాబాద్ :**

ఈ ఇంటి పేరు ధర్మనిలయం, ఆ ఇంట్లో ఓ పెద్దావిడ.. ఆమె పేరు అనుసూయమ్మ సదా రాముణ్ణి ధ్యానించే అనుసూయమ్మ, గత 40 సంవత్సరాలుగా సైదాబాద్ ఏపీఏయూ కాలనీలోని ధర్మనిలయంలో మరమరాలు... వేరు సెనగలతో తీర్చిదిద్దిన పందిరిలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ శ్రీ రామనవమి ఉత్సవాలు ఉగాది రోజున ప్రారంభమై నవమి రోజు కళ్యాణంతో ముగుస్తాయి, అంతేగాకుండా రామాయణ ఇతిహాసం తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, ఈ ఉత్సవాలలో నిత్య అన్నదానంలో వేలాదిమంది భక్తులు పాల్గొంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం దగ్గర్లో ఉండే ఊరి నుంచి వచ్చిన సూర్యనారాయణ రాజు కుటుంబం తమ ఇంట్లోనే ధర్మనిలయం పేరిట రామాలయాన్ని ఏర్పాటు చేశారు. 40 ఏళ్లుగా ఈ నిలయంలో మరమరాలతో పం దిరి వేసి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం సూర్యనారాయణ రాజు శివైక్యం చేయగా ఆయన సతీమణి కుటుంబసభ్యులతో కలిసి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఒక్కడ జరిగే ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాలలో రామకోటి జపం, విష్ణుసహస్ర నామాలు, నగర సంకీర్తన, భజనలు, హోమాలు, నిత్యాన్నదానం కొనసాగిస్తారు.

**60 కిలోల మరమరాలు, 40 కిలోల వేరుశెనగలతో....**

మాఘ శుద్ధ పంచమి రోజున గ్రామదేవతకు చలిమిడి, పాలతో అభిషేకించి పందిరి పనులకు శ్రీకారం చుడతారు. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున ప్రారంభిస్తారు. సుమారు 40 మంది మహిళలు రోజు దారాలకు మనమరాలు ఎక్కిస్తారు. 60 కిలోల మరమరాలు, 40 కిలోల వేరుశెనగలను అలంకరణకు వినియోగిస్తారు. రామనామ జపం చేస్తూ మహిళలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ అల్లికలను సాగిస్తారు.

## ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల వెంటనే అమలు చేసి ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక చైర్మెన్ బద్రి డిమాండ్ చేశారు. ఈ నెల 16న సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించే తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనం కు సంబంధించిన పోస్టర్ ను ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద విడుదల చేసారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులతో పాటు ఉపాధి హామీ కల్పించాలన్నారు. 250 గజాల స్థలాన్ని ఉద్యమకారులను ఇస్తామని చెప్పిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి ఉద్యమకారులు ఈ సమావేశంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

05
జయభేరి సినిమా
05-04-2025
శనివారం
jayabheridaily.com

# 'పుష్ప' టైటిల్ కహానీ!




'పుష్ప' ఫ్రాంఛైజీ చిత్రాలు రెండూ భారతీయ బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాలు దేశవ్యాప్తంగా రికార్డులను తిరగరాశాయి. పుష్పరాజ్ పాత్ర మాస్ ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అయింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాలో హీరోకి పుష్ప అనే పేరు ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయం గురించి దర్శకుడు సుకుమార్ ఆసక్తికరమైన వివరాల్ని వెల్లడించారు. తమిళనాడులో జరిగిన ఓ ఈవెంట్‌లో సుకుమార్ మాట్లాడారు. 'పుష్ప' సినిమాలోని హీరో పుష్పరాజ్ పాత్రను నిజమైన గంధపు చెక్కల స్మగ్లర్ నుంచి స్ఫూర్తిపొంది రూపొందించినట్లు చెప్పారు. 'ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఓ వెబ్‌సిరీస్ తీద్దామనుకొని పుష్పరాజ్ అనే స్మగ్లర్‌ను కలిశా. నాకెందుకో ఆ పేరు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. దాంతో అతన్ని ఇంటర్వ్యూ చేశాను. అదే పేరుతో సినిమా తీస్తే బాగుంటుందనిపించింది. సాధారణంగా 'పుష్ప' అనే పేరు మహిళలకు ఉంటుంది..కానీ ఓ స్మగ్లర్ అలాంటి పేరు పెట్టుకోవడం నన్ను ఆకర్షించింది అని సుకుమార్ తెలిపారు. ప్రస్తుతం సుకుమార్ మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.



# రెమ్యునరేషన్ ఏకంగా అన్ని కోట్లా?

పుష్ప 2 సినిమాతో అల్లు అర్జున్ రేంజ్ రెట్టింపయ్యింది. ఇప్పుడు అతనితో సినిమాలు తీసేందుకు స్టార్ డైరెక్టర్లు క్యూ కడుతున్నారు. అయితే అల్లు అర్జున్ మాత్రం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీకి ఛాన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాన్ ఇండియా రేంజ్ లో దర్శకుడు అట్లీకి చాలా డిమాండ్ ఉంది . బాలీవుడ్ లో 'జవాన్' సినిమాతో భారీ విజయాన్ని సాధించాడీ యంగ్ అండ్ ట్యాలెంటెడ్ డైరెక్టర్.ఈ నేపథ్యంలో తన తర్వాతి సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చేయనున్నాడని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా కోసం ఇప్పటికే సన్నాహాలు కూడా ప్రారంభమయ్యాయని టాక్. కాగా ఈ క్రేజీ ప్రాజెక్టుకు హీరోయిన్ ఎంపిక విషయంలో అట్లీ సందిగ్ధంలో ఉన్నాడట. అయితే కొన్ని నివేదికల ప్రకారం అల్లు అర్జున్ సినిమా కోసం అట్లీ గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రాతో చర్చలు జరుపుతున్నాడని సమాచారం. కాగా ప్రియాంక చోప్రా గత కొన్ని సంవత్సరాలుగా హాలీవుడ్ సినిమాలతో బిజి బిజీగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా భారతీయ సినిమాలకు దూరంగా ఉంటోన్న ఆమె ఇప్పుడు తొలిసారిగా ఓ తెలుగు సినిమాలో నటిస్తోంది. దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా నటిస్తోన్న ఎస్ ఎస్ ఎమ్ బీ 29 (వర్కింగ్ టైటిల్) సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. దీని తర్వాత అట్లీ దర్శకత్వంలో ఒక సినిమా చేయడానికి ప్రియాంక అంగీకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. అల్లు అర్జున్ తో సినిమా అంటే అట్లీకి కఠిన సవాలే అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే, 'పుష్ప 2' తర్వాత అభిమానుల అంచనాలు అమాతం పెరిగాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా సినిమా తీయాలి. అందులో భాగంగానే బలమైన క్యాస్టింగ్ ను రెడీ చేసుకుంటున్నాడు. రాజమౌళి మహేష్ బాబు సినిమాతో ప్రియాంక చోప్రాకు టాలీవుడ్‌లో క్రేజ్ పెరగడం ఖాయం. ఆ తర్వాత అల్లు అర్జున్ తో జత కడితే తమ సినిమాకు భారీ హైప్ వస్తుందని అట్లీ మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది.



# 'మిస్ ఇండియా' వద్దనుకుంది..

అందాల పోటీలకు సంబంధించి మన దేశంలో 'మిస్ ఇండియా' కాంటెస్ట్ ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. అందులో పాల్గొనాలని, విజేతగా నిలవాలని కోరుకుంటారు. కానీ ఈ టాలీవుడ్ హీరోయిన్ మాత్రం తన మెడిసిన్ థియరీ ఎక్సామ్ ఉందని మిస్ ఇండియా పోటీల నుంచే తప్పుకుంది. పై ఫొటోలో ఉన్నదెవరో గుర్తు పట్టారా? ఆమె ప్రస్తుతం టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. తల్లిదండ్రూలిద్దరూ ప్రముఖ నటులే. వారిద్దరి అడుగుజాడల్లోనే నడుస్తూ ఈ ముద్దుగుమ్మ కూడా సినిమాల్లోకి అడుగు పెట్టింది. కానీ సైన్ చేసిన మొదటి రెండు సినిమాలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో ఐరన్ లెగ్ అంటారేమోనన్న భయంతో సినిమా ఇండస్ట్రీలోకి రాక ముందే డిప్రెషన్ లోకి వెళ్లిపోయిందీ అందాల తార. అయితే సినిమా రంగంలో ఎంతో అనుభవమున్న తల్లిదండ్రుల సూచనలతో క్రమంగా కోలుకుంది. మళ్లీ హీరోయిన్ గా ప్రయత్నాలు మొదలు పెట్టింది. వరుసగా సినిమాలు చేసింది. అందం, అభినయం పరంగా మంచి మార్కులు తెచ్చుకుంది. తెలుగుతో పాటు తమిళంలోనూ తన నటనతో ఆడియెన్స్ ను మెప్పించింది. అన్నట్లు ఈ టాలీవుడ్ హీరోయిన్ ప్రస్తుతం మెడిసిన్ చదువుతోంది. నటిగా కంటే డాక్టర్ కావడమే తన మొదటి లక్ష్యమంటోంది. అందుకే ప్రతిష్ఠాత్మక మిస్ ఇండియా పోటీలను సైతం వద్దనుకుంది. మరి ఈ టాలీవుడ్ ముద్దుగుమ్మ ఎవరో గుర్తు పట్టారా? ఆమె మరెవరో కాదు సీనియర్ హీరో రాజశేఖర్ దంపతుల కుమార్తె శివానీ రాజశేఖర్. తాజాగా ఈ అందాల తారకు మాధవన్ సినిమాలో నటించే ఛాన్స్ వచ్చింది. అది కూడా ఒక పాన్ ఇండియా సినిమాలో. ఈ నేపథ్యంలో శివానీ రాజశేఖర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

# స్పెషల్ ప్లేస్‌లో రష్మిక బర్త్ డే సెలబ్రేషన్స్..

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న చాలా బిజీ బిజీగా ఉంటోంది. గత కొన్ని నెలలుగా ఆమె వరుసగా సినిమా షూటింగ్ లకు హాజరవుతోంది. కాలు విరిగినా, జ్వరంతో బాధపడినా షూటింగులు మాత్రం కొనసాగిస్తూనే ఉంది. అయితే శుక్రవారం (ఏప్రిల్ 05) రష్మిక పుట్టిన రోజు. దీంతో ఈ స్పెషల్ డే కోసం ఆమె సినిమా షూటింగుల నుంచి కాస్త బ్రేక్ తీసుకుని విదేశాలకు వెళ్లిందని సమాచారం. అక్కడ తన స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు జరపుకొంటోందని సమాచారం. రష్మిక మందన్న గల్ఫ్ దేశాలలో ఒకటైన ఒమన్ కు వెళ్లి అక్కడి అందమైన ఎడారిలో తన బర్త్ డేను సెలబ్రేట్ చేసుకోనుందట. ఇందుకోసం ఇప్పటికే రష్మికతో పాటు ఆమె స్నేహితులు మరికొందరు ఒమన్ కు వెళ్లారట. అయితే రష్మిక బర్త్ డే వేడుకల్లో విజయ్ దేవర కొండ కూడా పాల్గొంటాడని సమాచారం. ఇప్పటికే అతను కూడా ఒమన్ వెళ్లాడని టాక్. విజయ్ దేవరకొండ, రష్మిక మాత్రమే కాదు, వారి కామన్ ఫ్రెండ్స్ కూడా ఒమన్ వెళ్లారని చెబుతున్నారు. రష్మిక మందన్న ప్రస్తుతం చాలా బిజీగా ఉన్న నటి. ఆమె నటించిన 'సికంర్' సినిమా ఇటీవలే విడుదలైంది. అదనంగా, ఆమె తెలుగులో 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలో నటిస్తోంది. 'పుష్ప 3' సినిమాలో రష్మిక కూడా ఉంటుందని చెబుతున్నారు. ఆమె ధనుష్ తో కలిసి 'కుబేర' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఇక ఛావా, సికందర్ తర్వాత 'తమా' అనే హిందీ సినిమాలోనూ రష్మిక లీడ్ రోల్ పోషిస్తోంది. అలాగే లేడీ ఓరియెంటెడ్ మూవీ 'రెయిన్‌బో'లోనూ యాక్ట్ చేస్తోంది. దీంతో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులు రష్మిక చేతిలో ఉన్నాయి. మొత్తం మీద, రష్మిక చేతినిండా సినిమాలతో చాలా బిజీగా ఉంటోంది.





# మూడేళ్ల తర్వాత ఫ్యాన్స్ మధ్యకి వస్తున్న ఎన్టీఆర్..

యంగ్ టైగర్ ఎన్టీఆర్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్‌డమ్ సంపాదించుకున్న ఎన్టీఆర్ దేవర సినిమాతో మంచి హిట్ కొట్టాడు. ఇక వార్ 2 చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం దేవర ప్రమోషన్స్ కోసం జపాన్ వెళ్లిన జూనియర్ అక్కడ తెగ సందడి చేశాడు. జపాన్ ఫ్యాన్స్ తో కలిసి నానా హంగామా చేశాడు. ఇక ఇదిలా ఉంటే ఎన్టీఆర్ తెలుగు ఆడియన్స్ మధ్యకి వచ్చి చాలా రోజులు అవుతుంది. ఆర్ఆర్ఆర్ ఈవెంట్ తర్వాత బహిరంగంగా ఆయన ఎలాంటి ఈవెంట్‌కి హాజరు కాలేదు.

'దేవర సినిమాకు ఈవెంట్ నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేయగా.. హైదరాబాద్ నోవాటెల్ కి ఫ్యాన్స్ పెద్ద ఎత్తున చేరారు . అక్కడ అద్దాలు పగలగొట్టడం , నానా భిబత్సం సృష్టించడంతో ఈవెంట్ నిర్వాహణపై టీం కాస్త వెనక్కి తగ్గింది. ఇక ఆ తర్వాత ఎన్టీఆర్ ఎలాంటి పెద్ద ఈవెంట్స్‌కి, ప్రీ రిలీజ్ ఫంక్షన్స్‌కి హాజరైంది లేదు. కాని ఇప్పుడు తన బావ మరిది నార్నే నితిన్ హీరోగా నటించి 'మ్యాడ్ స్క్వేర్ మూవీ సక్సెస్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ క్రమంలో ఎక్కువ మంది బౌన్సర్లను పెట్టండి. పోలీస్ భద్రత చూసుకోండి. ఈవెంట్ సక్సెస్ ఫుల్‌గా జరిగేలా చూడండి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సోషల్ మీడియా వేదికగా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈవెంట్‌కు ఎన్టీఆర్ సహా మూవీ టీంతో పాటు భారీగా అభిమానులు తరలి వస్తున్నారు. అయితే ఈవెంట్ పూర్తైన తర్వాత ఎప్పుడు కూడా ఇంటికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని.. ఇంటి వద్ద మీ వాళ్లు ఎదురు చూస్తుంటారని.. సురక్షితంగా డ్రైవింగ్ చేస్తూ ఇంటికి చేరుకోవాలని సూచిస్తుంటారు. ఈవెంట్ వద్ద కూడా ఫ్యాన్స్ భద్రతపై ఫోకస్ చేసేలా నిర్వాహకులకు ఆయన టీం సూచిస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com